www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 317 | ఆదివారం | 18 మే, 2025




## ముంబైలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదుల పట్టివేత

- ఛత్రపతి విమానాశ్రయంలో పట్టుకున్న ఎన్ఐఏ
- కశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవేట

02



## పాక్‌కు గూఢచర్య సేవలు

యూట్యూబర్ సహా ఆరుగురి అరెస్ట్

02




# మహిళలే ఆదర్శం

- అందుకు ఇందిరా గాంధీ నిదర్శనం
- కోటీశ్వరులను చేయాలన్నదే లక్ష్యం
- వాళ్లతో పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు
- అర్బన్ ఏరియాలో మహిళా సంఘాల్లో చేర్చేందుకు స్పెషల్ డ్రైవ్
- వుమెన్ యాక్సిలరేషన్‌లో సీఎం రేవంత్

## మహిళా శక్తిని తక్కువ అంచనా వేయొద్దు

**ప్రజానావ, హైదరాబాద్:** మహిళలే దేశానికి ఆదర్శమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు- చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..కోటిమంది మహిళలు కోటీశ్వరులు అయితే, ఆర్థికంగా రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళా శక్తిని ప్రపంచానికి ఇందిరాగాంధీ చూపించారు. రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలి. మహిళల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తీసుకొచ్చాం. ఆడబిడ్డలకు రూ.500కే సిలిండర్ అందిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే

మిగతా 2 లో





## చెరువుల్లో వ్యర్థాలు పోస్తే చర్యలు

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

..3లో



## లాడెన్‌ను అంతమొందించినట్లే.. మన ఆపరేషన్

- సిందూర్‌తో ఉగ్రమూకలను అణచివేశాం
- ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్

03



## సీఎంతో నోబెల్ గ్రహీత అభిజిత్ భేటీ

- త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు
- బోర్డులో భాగస్వామి కావాలని రేవంత్ అభ్యర్థన

02



## మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట

- భూ సేకరణ పోరాట కేసు కొట్టివేత

02



## కొనసాగుతన్న సరస్వతీ పుష్కరాలు

- పుణ్యస్నానం ఆచరించిన మంత్రి తుమ్మల

02

# త్వరలో కొత్త రేషన్ కార్డులు

- మెట్రో ఛార్జీల పెంపును పరిశీలిస్తాం
- హైదరాబాద్ అభివృద్ధిపై సమీక్షించిన మంత్రి పొన్నం



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు త్వరలో పంపిణీ చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అలాగే, మెట్రో టికెట్ ధరల పెంపుపై కూడా తన దృష్టికి వచ్చిందని అన్నారు. వయబుల్ కాని కారణంగా మెట్రో ఛార్జీలు పెంచినట్లుగా వారు చెబుతున్నారు.. దానిపై ప్రభుత్వం సమీక్ష చేస్తుంది.. హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రిగా తాను కూడా ఛార్జీలు తగ్గించమని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేస్తాను అని వెల్లడించారు. నగర అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన జీహెచ్‌ఎంసీ సమీక్ష సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధి పనులపై చర్చించాం అని తెలిపారు. ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించాను.. వర్షాకాలంలో వచ్చే సమస్యలను తగ్గించేలా క్షేత్ర స్థాయిలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించాం..

మిగతా 2 లో



02

## సైనికులకు సెల్యూట్

- తిరంగా ర్యాలీలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..


# మహిళలే ఆదర్శం



మొదటి పేజీ తరువాయి

అప్పగించాం. ఈ నెల 21న ఇందిరా మహిళ స్టాళ్లను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చాలి. కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇస్తే తీసుకొని పలువురు దేశం విడిచి పారిపోతున్నారు. మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయి వడ్డీతో సహా చెల్లిస్తున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు- చేసిన స్టాళ్లను పరిశీలించారు. మహిళలే దేశానికి ఆదర్శం అని అన్నారు. మహిళలు కోటీశ్వరులు కావాలని, మహిళలకు అండగా నిలబడతానని, ఆర్థికంగా ఎదగండని రేవంత్ రెడ్డి సూచించారు. మహిళలు ఆర్థిక శిక్షణ పాటిస్తున్నారని, ఆడబిడ్డలను ప్రోత్సహించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. ఆడబిడ్డలు వ్యాపారంలో నిలదొక్కుకుంటే.. కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఒక యూనిక్ ఐడి కార్డు ఇస్తామని, మహిళల ఆరోగ్యం నుంచి సంపాదన వివరాలన్నీ తెలిపేలా యూనిక్ ఐడి కార్డు లభిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సీఎంతో నోబెల్ గ్రహీత అభిజిత్ భేటీ



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆర్థికశాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. త్వరలో తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ఈ బోర్డులో భాగస్వామ్యం కావాలని అభిజిత్ బెనర్జీని కోరగా.. అందుకు ఆయన అంగీకరించారు. ఫ్యూచర్ సిటిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని సలహా ఇచ్చారు. ఆర్థిక శాస్త్ర నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తో మర్యాదపూర్వకంగా భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన పథకాలు, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాసేపు ముచ్చటించారు. శనివారం బంజారాహిల్స్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఆదాయాన్ని పెంచేందుకు ఉన్న మార్గాలు, ఆర్థిక క్రమశిక్షణ, పట్టణాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టించడంతో పాటు తదితర అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. శతాబ్దాల చరిత్ర ఉన్న హైదరాబాద్ విజన్ ను, ఇక్కడ తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణ గురించి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఆయనకు వివరించారు. తెలంగాణకు సంబంధించిన విశిష్టతను, ఇక్కడున్న అనుకూలతలను ప్రపంచమంతటా చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు.మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతుల సాధికారత, యువతకు ఉద్యోగాలతో పాటు స్కిల్ డెవెలప్మెంట్ దిశగా ప్రభుత్వం చేపడుతున్న విప్లవాత్మక చర్యలను ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు- చేయనున్న తెలంగాణ రైజింగ్ విజన్ బోర్డులో భాగస్వామ్యం పంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అభిజిత్ బెనర్జీని ఆహ్వానించారు. భవిష్యత్తు విజన్ రూపకల్పనలో ఇతర ప్రముఖులతో పాటు- తమ అనుభవాలను పంచుకోవాలని కోరారు. గొప్ప విజన్ తో ముందుకు సాగుతున్నారని అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశంసించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు బోర్డులో చేరడానికి సమ్మతించారు. పోలీస్, మున్సిపల్ శాఖల్లో ట్రాన్స్జెండర్ల నియామకం, ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాను సర్వీస్ సెక్టార్ గా అభివృద్ధి చేసే ప్రణాళికను ఎంచుకోవటం, స్కిల్ యూనివర్సిటీ-, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయటం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికతకు అద్దం పట్టిందని అభిజిత్ బెనర్జీ ముఖ్యమంత్రిని అభినందించారు. భారత్ ఫ్యూచర్ సిటిలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్, సృజనాత్మకతను భాగం చేయాలని అభిజిత్ బెనర్జీ సూచించారు. సంప్రదాయ చేతివృత్తుల వారిని ఆధునిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. అత్యాధునిక సాంకేతికత, సోషల్ మీడియా, మార్కెటింగ్ నైపుణ్యాలతో వారిని వృద్ధి చేయాలన్నారు.



# ఐసిస్ ఉగ్రవాదుల పట్టివేత

**ముంబై, మే 17:** పహల్గాం ఘటన నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట కొనసాగుతోంది.తాజాగా ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇద్దరు ఐసిస్ అనుమానిత ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు అరెస్ట్ చేశారు. ఇండోనేషియాలోని జకార్తా నుంచి భారత్‌కు వచ్చిన ఐసిస్ సభ్యులు అబ్దుల్లా ఫయాజ్ షేక్ అలియాస్ డైపర్‌వాలా, తల్హా ఖాన్‌లను అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి విమానాశ్రయంలోని టెర్మినల్ 2 వద్ద వీరు అనుమానాస్పదంగా తచ్చాడుతుండడంతో ఇమిగ్రేషన్ బ్యూరో అధికారులు అడ్డుకున్నారు. ఐసిస్ స్లీపర్ సెల్ విభాగంతో వీరికి సంబంధాలు ఉన్నట్లు- గుర్తించామన్నారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం ఇద్దరు నిందితులను ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నారు. 2023లో మహారాష్ట్రలోని పుణేలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్ (ఐఈడీలు) తయారీ, పరీక్షలకు సంబంధించిన కేసులో స్థానిక పోలీసులు ఇప్పటికే వీరిని గాలిస్తున్నట్లు సమాచారం. అప్పట్లో వీరు భారత్‌లో ఉన్న స్లీపర్ సెల్స్‌తో దేశంలో ఉగ్ర కుట్రలకు ప్రణాళికలు రచించినట్లు వెల్లడించారు. అదే ప్రదేశంలో స్లీపర్ సెల్స్‌కు బాంబు తయారీ శిక్షణ వర్క్‌షాప్‌ను నిర్వహించారని అధికారులు తెలిపారు. వారిని పట్టుకోవడానికి సమాచారం ఇచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.3 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించినట్లు- తెలుస్తోంది. గత రెండేళ్లుగా పరారీలో ఉన్న వీరు భారత్-పాక్ ఉద్రిక్తతల సమయంలో ముంబయికి రావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు. వీరితో కలిపి ఇప్పటివరకు 10మంది ఐసిస్ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు- తెలిపారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలనే భారత ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడం కోసం ఎన్ఐఏ తీవ్రంగా ప్రయత్నిస్తోందని అధికారులు పేర్కొన్నారు. భారత్‌లో ఐసిస్ కార్యకలాపాలను నిర్వీర్యం చేయడానికి ఏజెన్సీ చేస్తున్న ప్రయత్నాలలో ఈ అరెస్టులు ఒక ప్రధాన ముందడుగని తెలిపారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏ బృందాలు ఉగ్రవాదుల జాడ కోసం జమ్మూకశ్మీర్ అంతటా జల్లెడ పడుతున్నాయి. శనివారం స్థానిక అధికారులతో కలిసి ఉత్తరకశ్మీర్‌లోని కుప్వారా, శ్రీనగర్, గందర్‌బాల్, బారాముల్లా సహా 10 ప్రదేశాల్లో సోదాలు చేపట్టినట్లు- అధికారులు పేర్కొన్నారు. మరోవైపు పంజాబ్‌లోని బబ్బర్ ఖల్సా ఉగ్రవాద సంస్థకు చెందిన 15 ప్రదేశాలపై ఎన్ఐఏ బృందాలు దాడులు చేశాయి.

# సైనికులకు సెల్యూట్

## తిరంగా ర్యాలీలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య

**ప్రజానావ, హైదరాబాద్:** పాక్, పీవోకేలోని టెర్రరిస్టు స్థావరాలను ధ్వంసం చేసిన సైనికులకు సెల్యూట్ చేస్తున్నానని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్‌కు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గ్రాండ్ సక్సెస్ అయిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా తిరంగా విజయ యాత్ర చేపట్టాని బీజేపీ పిలుపునిచ్చింది. హై కమాండ్ పిలుపు మేరకు తెలంగాణ బీజేపీ యూనిట్ శనివారం హైదరాబాద్‌లో తిరంగా యాత్ర చేపట్టింది. ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ ర్యాలీకి హాజరైన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. మనది శాంతి కోరుకునే దేశమని.. భారత్ ఎప్పుడూ ఏ దేశం మీద ముందుగా దాడి చేయలేదని అన్నారు. పాక్‌తో ఉద్రిక్తతల వేళ ప్రధాని మోడీ ప్రదర్శించిన సమయస్ఫూర్తిని మెచ్చుకోవాలన్నారు. దేశ అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రజలు కుల, మత, భాష, ప్రాంతాలకు అతీతంగా ఉండాలని కోరారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని పురస్కరించుకొని, మన దేశ సైనికులకు సంఘీభావంగా హైదరాబాద్ ట్యాంక్ బండ్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న డాక్టర్. బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమైన 'తిరంగా ర్యాలీ'.. సచివాలయం జంక్షన్ మీదుగా సైనిక ట్యాంక్ వరకు కొనసాగింది.

# మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట

## భూ సేకరణ పోరాట కేసు కొట్టివేత



**ప్రజానావ, హైదరాబాద్:** మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట దక్కింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు కొట్టివేసింది.కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ అంశంలో మంత్రి శ్రీధర్‌బాబుపై సహా 13 మందిపై నమోదైన కేసును నాంపల్లి కోర్టు కొట్టివేసింది. 2017లో శ్రీధర్‌బాబుతోపాటు- పలువురు కాంగ్రెస్ నేతలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కేసును కోర్టు కొట్టివేసిన అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతుల తరఫున పోరాడితే కేసులు పెట్టారని, చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా విచారణ చేస్తున్న సందర్భంగా రైతుల హక్కులను కాపాడేందుకు వినతిపత్రాన్ని ఇవ్వాలని వెళ్లాము. అధికారం అండతో మాపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎనిమిదేళ్లపాటు ఈ కేసు నడిచింది. తాజాగా న్యాయస్థానం కొట్టివేసింది. ఇది ప్రజా విజయం. రైతుల విజయం. పేదరైతు ఘోషను న్యాయస్థానం విన్నది. అధికారం ఉందని నాడు కేసులు పెట్టారు. పోలీసులను అడ్డగోలుగా వినియోగించు కున్నారు. కానీ, ఇవాళ ప్రజాస్వామ్యం ఉంది. చట్టాలను నమ్ముతూ మేం ముందుకు వెళ్తున్నాం. మాకు అధికారం ఉందని ఎక్కడా దుర్వినియోగం చేయడం లేదు. భారాస ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూడా నిలవలేదు. దానిపైనా విచారణ జరుగుతోంది. తప్పు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు.

# త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ




మొదటి పేజీ తరువాయి

ఇక, నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేస్తాం.. స్ట్రీట్ లైట్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం.. అలాగే, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు ఇప్పటి వరకు ఇంటిని ఆక్యుపై చేసుకొని వారి విషయంలో ఏం చేయాలనే అంశంలో ఆలోచిస్తున్నామని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రాష్ట్రంలో కొత్త టెక్నాలజీ అనుసంధానం చేస్తూ కోటి రేషన్ కార్డులన్నింటిని ఎటిఎం తరహా స్మార్ట్(చిప్) కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలన్న ప్రభుత్వ సంకల్పం మరింత జాప్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. రేషన్ పక్రియను మరింత సులభతరం చేసే చర్యల్లో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై గత కొన్ని నెలలుగా ఎంతో కసరత్తు చేసింది. ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పలు రాష్ట్రాల్లో అమలు అవుతున్న తీరుతెన్నులను పరిశీలించింది. దాంతో వాటి కన్నా తెలంగాణ రాష్ట్రంలోనే మెరుగైన పరిస్థితులు ఉన్నాయన్న అభిప్రాయానికి వచ్చారు. దాంతో పటిష్టమైన నిబంధనలతో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పక్రియకు శ్రీకారం చుట్టారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల తయారీ ఏజెన్సీల ఖరారుకు ప్రభుత్వం -టెండర్లను పిలిచింది. పౌరసరఫరాల శాఖ ఇచ్చిన టెండర్ లో స్మార్ట్ కార్డు క్వాలిటీ నిబంధనలు నిర్దేశిరచారు. అంతే కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణకు వీలుగా -టెండర్‌లో పాల్గొనే సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన కార్యాలయం లేదా బ్రాంచ్ ఉండాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. గతంలో అనుభవాలను దృష్టిలో పెట్టు-కుని ఏదైన న్యాయపరమైన వివాదాలకు తలెత్తినప్పుడు సదరు ఏజెన్సీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం స్పష్టంగా ఆ నిబంధనను పెట్టింది. రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ కార్డులు 90.42 లక్షలు ఉన్నాయి. వీటి ద్వారా 285.98 లక్షల మంది లబ్దిపొందుతున్నారు. ఇంకా అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్దంగా ఉండడంతో పేదలు కొత్త రేషన్ కార్డుల కోసం ధరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ విధంగా ప్రజా పాలన కార్యక్రమంలో, మీ సేవ కేంద్రాల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం ఎక్కువ సంఖ్యలో ధరఖాస్తులు అందుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15లక్షల మేరకు కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకున్నారు. వారంతా ప్రజాపాలన గ్రామసభలలో, మీ సేవ కేంద్రాల్లో ధరఖాస్తు చేసుకున్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో 19,34,464 ధరఖాస్తులు అందాయి. వాటిలో 1,97.450 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఇంకా 17,37,014 ధరఖాస్తులను పరిశీలన దశలో ఉన్నాయి. రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాల్లో 12,56,719 ధరఖాస్తులు రేషన్ కార్డుల కోసం వచ్చాయి. వాటిల్లో 7,71,053 ధరఖాస్తులను పరిశీలించారు. ఇంకా 4,85,666 ధరఖాస్తులను పరిశీలన దశలో ఉన్నాయి.



# డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ అగ్రస్థానం

## పోలీసులకు సీఎం రేవంత్ అభినందనలు

**ప్రజానావ, హైదరాబాద్:** డ్రగ్స్ కట్టడిలో ప్రపంచంలోనే తెలంగాణ అగ్రస్థానం సాధించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 138 దేశాలతో పోటీపడి ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటామన్నారు. ప్రపంచానికే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

# కొనసాగుతన్న సరస్వతీ పుష్కరాలు

## పుణ్యస్నానం ఆచరించిన మంత్రి తుమ్మల



**ప్రజానావ, కాళేశ్వరం:** కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి. పుష్కర ఘాట్‌లో మూడో రోజు పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం కారణంగా రహదారులన్నీ బురదమయంగా మారాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పుణ్య స్నానం ఆచరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలకు సహకరించారు. ఇకపోతే కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల వాహనాలకు టోల్ ట్యాక్స్ రద్దు చేశారు. ఈమేరకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటించారు. వాహనాల రద్దీ నియంత్రణకు టోల్ ట్యాక్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం 18 మే 2025 హైదరాబాద్


# లాడెన్‌ను అంతమొందించినట్లే..

- సిందూర్‌తో ఉగ్రమూకలను అణచివేశాం
- ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్



**లక్నో, మే 17 :** ఆపరేషన్ సిందూర్ ..లాడెన్‌ను అంతమొందించిన ఘటనతో ఉపరాష్ట్రతి ధన్‌కడ్ పోల్చారు. అమెరికా కూడా ఇలాగే లాడెన్‌ను మట్టుపెట్టగా భారత్ కూడా అదే చేసిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో ఉగ్రవాది బిన్ లాడెన్‌ను అమెరికా హతమార్చిన ఘటనతో ఆపరేషన్ సిందూర్‌ను పోల్చారు. భారత్ మునుపెన్నడూ లేని విధంగా పాక్‌లోకి చొచ్చుకొని వెళ్లి మరీ ఉగ్రమూకలను ఏరివేసిందని వ్యాఖ్యానించారు. 2011, మే 2న అమెరికా దళాలు ఇదేవిధంగా వ్యవహరించాయని లాడెన్ పేరు ప్రస్తావించకుండా మాట్లాడారు. ప్రపంచానికి తెలిసేలా భారత్ చేసి చూపించింది. శాంతియుత వాతావరణానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఉగ్రవాదుల్ని తుదముట్టించడం ద్వారా ఒక బెంచ్ మార్క్‌ను నిర్ణయించిందని ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. భారత్ ఎంతో కచ్చితత్వంతో దాడులు చేసిందని, ఉగ్రమూకలకు మాత్రమే నష్టం వాటిల్లిందని అన్నారు. అమెరికా చరిత్రలో అత్యంత విషాద ఘటనగా మిగిలిన వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై సెప్టెంబర్ 11, 2001లో అల్‌ఖైదా జరిపిన ఉగ్ర దాడిలో సుమారు మూడు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. వేల మందిని పొట్టన పెట్టుకున్న అల్‌ఖైదా అధినేత బిన్ లాడెన్‌ను 2011 మే 2న అమెరికా దళాలు హతమార్చిన విషయం తెలిసిందే. యూఎస్ నేవీ సీల్ బృందం ప్రత్యేక కమాండో ఆపరేషన్ చేపట్టి అబొట్టాబాద్ కాంపౌండ్‌లో నక్కిన లాడెన్‌ను మట్టుబెట్టింది. నాటి అధ్యక్షుడు బరాక్ ఒబామా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో 'ఆపరేషన్ నెప్ట్యూన్ స్పియర్' పేరిట లాడెన్‌ను హతం చేశారు. భారత ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే దేశాల ఆర్థిక వ్యవస్థలకు సాయం చేయలేమని ధన్‌ఖడ్ అన్నారు. మనలో ప్రతి ఒక్కరు ఆర్థిక జాతీయవాదం గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పాకిస్థాన్‌కు వత్తాసు పలికిన తుర్కియే, అజర్‌బైజాన్‌లపై భారత్‌లో బాయ్‌కాట్ నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తరుణంలో ఉపరాష్ట్రపతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# మనం శక్తివంతులం అయితేనే గుర్తింపు

- ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తిని చాటాం
- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



**జయపుర, మే 17 :** ఆపరేషన్ సిందూర్‌తో మన శక్తి సామర్థ్యాలు ఏమిటో ప్రపంచానికి తెలిసిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. శక్తిసామర్థ్యాలు ఉన్నప్పుడే ప్రపంచం మన మాట వింటుందని మోహన్ భాగవత్ అన్నారు. భారత్‌లో త్యాగాలతో కూడిన సంప్రదాయం కొనసాగుతుందని.. దీన్ని మనం కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాజస్థాన్‌లోని జయపురలో నిర్వహించిన రవినాథ్ మహారాజ్ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన ఆయన.. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో త్యాగాల సంప్రదాయం కొనసాగుతోంది. ఈ మేరకే మనం అందరు దేవుళ్లను పూజిస్తున్నాం. ప్రపంచ దేశాల్లో భారత్ పురాతనమైనది. అందుకే మన దేశానికి పెద్దన్నయ్యగా ప్రత్యేక స్థానం ఉంది. ప్రపంచ శాంతి కోసం భారత్ పాటుపడుతోంది. అయితే మనం పాటించే సంస్కృతీ సంప్రదాయలను, విశ్వాసాలను, మత సామ-రస్యాలను ప్రపంచానికి బోధించాల్సిన బాధ్యత కూడా మనపై ఉందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ పేర్కొన్నారు. ఇటీవల నెలకొన్న భారత్-పాక్ ఉద్రిక్తతలపై మోహన్ భాగవత్ ప్రస్తావిస్తూ.. మనం మరింత శక్తిమంతంగా ఉండాలని హితవు పలికారు. 'భారత్ ఎవరినీ ద్వేషించదు. కానీ అధికారం ఉంటేనే ఈ ప్రపంచం మన మాట వింటుంది. ఇదే ప్రపంచ స్వభావం. కాబట్టి విశ్వశాంతి కోసం మనం మరింత దృఢంగా తయారు కావాలి. భారత్-పాక్ ఉద్రిక్తతల అనంతరం ప్రపంచానికి మనమేంటో చూపించాం' అని మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. మం ఎవరి జోలికి వెళ్లం...ఎవరైనా మన జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.




# త్వరలో కొత్త రూ.20 నోట్లు

**ముంబై, మే 17:** దేశంలో కొత్త 20 రూపాయల నోట్లు రాబోతున్నాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో రూ.20 డినామినేషన్ నోట్లను విడుదల చేస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. రాబోయే నోట్ల డిజైన్, ఫీచర్లు ప్రస్తుతం మహాత్మాగాంధీ (కొ) సిరీస్ చెలామణిలో ఉన్న మాదిరిగానే ఉంటాయని ఆర్బీఐ వెల్లడించింది. రాబోయే కొత్త నోట్లతో పాటే పాత నోట్లు చలామణి అవుతాయి. ఇందులో ఎలాంటి ఇబ్బంది ఉండదు. కలర్ స్కీమ్, కొలతలు, సెక్యూరిటీ- ఫీచర్లు, వెనుకవైపు ఉండే ఎల్లోరా గుహల చిహ్నం.. అన్నీ యథావిధిగా ఉంటాయి. గతంలో జారీ చేసిన రూ .20 నోట్లు గవర్నర్ సంతకంతో సంబంధం లేకుండా పూర్తిగా చెల్లుబాటు-అవుతాయని ఆర్బీఐ స్పష్టం చేసింది. కొత్త గవర్నర్ సంతకంతో కొత్త నోట్లను జారీ చేయడం అనేది ఆర్బీఐ అధి నాయకత్వం మార్పు తర్వాత సాధారణంగా జరిగే పక్రియే.

# చెరువుల్లో వ్యర్థాలు పోస్తే కఠిన చర్యలు

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక



**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలోని చెరువుల్లో మట్టి, నిర్మాణ వ్యర్థాలు పోస్తే కఠిన చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. చెరువులపై నిఘా ఉంటుందని, మట్టిపోసిన వారిని సాక్ష్యాధారాలతో పట్టు-కుని క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. పలు రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులతో హైడ్రా కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమైన రంగనాథ్.. చెరువుల పరిరక్షణపై దిశానిర్దేశర చేశారు. బిల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్లు కలిసి.. మట్టిని ఎక్కడపోయాలో ముందుగానే ఒక అవగాహనకు రావాలని సూచించారు. అలా కాదని ఎవరికి వారు మట్టిని తరలించే పని కాంట్రాక్టర్‌కు అప్పగించాం.. ఆయన ఎక్కడ పోస్తే మాకేంటి అనేలా వ్యవహరిస్తే అందరిపైనా కేసులు పెడతామని హెచ్చరించారు. ట్రాన్స్‌పోర్టు ఖర్చులు మిగులుతాయని దగ్గర్లోని చెరువుల ఒడ్డున పడేస్తే వాహనాలు సీజ్ చేయడంతోపాటు డ్రైవర్, వాహన యజమాని, మట్టిని ఎక్కడి నుంచి తెస్తున్నారో సదరు నిర్మాణ సంస్థ యజమానిపై కూడా క్రిమినల్ కేసులు పెడతామన్నారు. శిఖం భూముల్లో కూడా మట్టి నింపరాదని సూచించారు. హైడ్రా పోలీసు స్టేషన్ కూడా అందుబాటు-లోకి వచ్చిందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా చెరువుల్లో మట్టిపోస్తున్నట్లు- గమనిస్తే హైడ్రా ఫోన్ నెంబర్ 9000113667తో పాటు- ఎక్స్ అకౌంట్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. చెరువులో మట్టి పోస్తున్న లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మట్టిని సర్దుతున్న జేసీబీల వీడియోలను కూడా హైడ్రాకు పంపించాలని సూచించారు. కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు- కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు అందరూ ఇందులో భాగం కావాలని రంగనాథ్ విజ్ఞప్తి చేశారు.

# సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టారు

## మాజీ ఎంపీ మాలోత్ కవిత



**ప్రజానావ, మహబూబాబాద్:** రైతు సంక్షేమంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని , కానీ కాంగ్రెస్ వచ్చాక దానిని పూర్తిగా విస్మరించారని మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సకల జనుల అభ్యున్నతే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగిందని శనివారం నాడిక్కడ అన్నారు. రైతుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. రైతులకు అండగా నిలిచేలా పెట్టుబడి పథకం దేశం ఎక్కడైనా అమలు చేస్తున్నారా చెప్పాలన్నారు. కానీ కాంగ్రెస్ సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని అన్నారు. కెసిఆర్ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెట్టలేరని అన్నారు. ప్రతి వర్గానికి చేదోడువాదోడుగా నిలిచేలా పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌దని అన్నారు. నాయకులు తమ స్వలాభం కోసం, స్వార్థం కోసం సిద్ధాంతాలను విస్మరించడం వల్లే బిఆర్ఎస్ ఓడిందని స్పష్టం చేశారు. తండాలన్నీ కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసి ఎన్నికలు జరిపిన ఘనత కెసిఆర్‌దన్నారు. ఇకపోతే ఏటా వర్షాకాలంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం మాయమయ్యిందని అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గడంతో వర్షాలు సమృద్ధిగా కురువడం లేదన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటే అందరూ మొక్కలు నాటడమే మార్గమని కెసిఆర్ గుర్తించారని అన్నారు. రైతులు వర్షంపై అధారపడి పంటలు పండిస్తారని వానలు కురవాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని తెలిపారు.

# రాజకీయాలకతీతంగా అభివృద్ధి

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




**ప్రజానావ, హైదరాబాద్:** పార్టీలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు రాజకీయాలని, తరవాత అంతా అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. దేశాభివృద్ధికి ఇదే కీలకమని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే పదవులు, రాజకీయ పార్టీలు శాశ్వతం కాదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎస్పీఆర్ హిల్స్‌లో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన రిజర్వాయర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ , మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం చెబుతోందన్నారు. మెట్రో డీపీఆర్‌ను పూర్తిస్థాయిలో కేంద్రానికి పంపలేదని.. సమగ్రంగా పంపిస్తే ఆలోచిస్తుందని చెప్పారు. ప్రజలకు ఎలా మేలు చేస్తున్నామనేది నేతలు ఆలోచించాలని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.

# ఢిల్లీలో ఈదురుగాలులతో భారీ వర్షం

## అనేక ప్రాంతాల్లో కూలిన చెట్లు

## గోడకూలి ముగ్గురు కూలీలు మృతి



**న్యూఢిల్లీ,మే17:** ఢిల్లీలో శనివారం బలమైన గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగర వాసులు వేడి నుంచి కొంత ఉపశమనం పొందారు. అయితే.. వర్షం, బలమైన గాలుల కారణంగా నష్టం జరిగింది. అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. నబీ రీం ప్రాంతంలోని అర్కాన్షా రోడ్డు వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు కూలీలు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రదేశం నుంచి అందరినీ ఖాళీ చేయించారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. ఢిల్లీ పోలీసులు, అగ్నిమాపక దళం బృందాలు సంఘటనా స్థలంలో సహాయ చర్యలలో నిమగ్నమయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుస్సేన్ ప్రమాదం గురించి సమాచారాన్ని పంచుకున్నారు. మృతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మృతుల్లో ఇద్దరు బీహార్, ఒకరు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారున్నారు. బీహార్‌లోని ముంగేర్‌కు చెందిన 65 ఏళ్ల ప్రభు, ముంగేర్‌కు చెందిన 40 ఏళ్ల నిరంజన మరణించారు. ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్‌కు చెందిన రోషన్ (35) కూడా ఈ ప్రమాదంలో మృతి చెందారు.ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే ఇమ్రాన్ హుస్సేన్ మాట్లాడుతూ.. సాయంత్రం 5:30 గంటలకు సమాచారం అందింది. నిర్మాణంలో ఉన్న ఇంటి గోడ కూలిపోయి కొంతమంది చనిపోయారని నాకు చెప్పారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. ఇంటి గోడ కూలిపోవడానికి గల కారణాలను తెలుసుకోవడానికి దర్యాప్తు నిర్వహిస్తాం. పహార్‌గంజ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయిన తరువాత, కఉఎ, డాగ్ స్క్వాడ్ బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయని తెలిపారు.

# ఉగ్రజాబితాలో పాక్‌ను చేర్చాలి

## ఐక్యరాజ్యసమితిలో తీర్మానానికి పట్టుబట్టాలి

## రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ సూచన



**న్యూఢిల్లీ, మే 17:** పాకిస్థాన్‌ను ఉగ్రవాదదేశంగా ప్రకటిస్తూ..చట్టవిరుద్ధ కార్యకలాపాల చట్టంలో సవరణ చేయాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ఉగ్రవాద నిర్మూలన భారత్- పాక్‌కే కాకుండా..ప్రపంచ దేశాల పురోగతికి ఉపయోగపడుతుందని సిబల్ అన్నారు. భారత్‌కు అతిపెద్ద సమస్య ఉగ్రవాదం కాబట్టి దానిని పూర్తిగా పెకలించివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఐక్యరాజ్యసమితిలో సవరణ తీసుకువచ్చి..పాక్‌ను ఉగ్రవాద దేశంగా జాబితా చేస్తూ షెడ్యూల్‌ను జోడించాలని సూచించారు. కశ్మీర్ ప్రజలు నిశ్చింతగా ఉండాలంటే భారత విదేశాంగ శాఖ ఈ చర్యలు తీసుకోవాల్సి ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రపంచ వేదికలపైకి వెళ్లినప్పుడు ఉగ్రవాద సమస్యపై వాటితో చర్చించాలని..ఉగ్రసంస్థలకు ప్రపంచ దేశాల నుంచి నిధులు అందకుండా అడ్డుకోవాలని సూచించారు. పాక్ ఉగ్రకుట్రలను అంతర్జాతీయ సమాజం ముందు ఎండగట్టడానికి భారత్ నుంచి అఖిలపక్ష ప్రతినిధుల బృందాలను ప్రపంచ దేశాలకు పంపాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సిబల్ స్వాగతించారు. ప్రతిపక్షాలతో సమావేశంలో వారు ఇచ్చిన సూచనలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంగీకరించారని అన్నారు. ఈ విధంగా దేశంలోని అన్ని పార్టీలు ఉగ్రవాద నిర్మూలనకు ఏకమైనప్పుడే సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన అనంతరం భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. అయినప్పటికీ పాక్ ఉగ్రవాదులను ప్రోత్సహిస్తుండడాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మరోవైపు ఉగ్రవాదం-వాణిజ్యం, ఉగ్రవాదం-చర్చలు ఒకేసారి సాధ్యం కావని ప్రధాని మోదీ ఇప్పటికే పాక్‌కు స్పష్టం చేశారు. అణుబాంబు బెదిరింపుల్ని భారత్ సహించదని.. ఈ ముసుగులో విజృంభిస్తున్న ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన, నిర్ణయాత్మకమైన దాడి చేస్తుందని హెచ్చరించారు. భారత్ చేసిన దాడులను తట్టు-కోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందన్నారు. పాక్‌కు నిధులు ఇస్తే..వాటితో ఉగ్రవాదులను పోషిస్తుందని..కాబట్టి ఆ దేశానికి ఎటువంటి సహాయం చేయొద్దని ఐఎంఎఫ్‌ను కోరారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## సంపాదకీయం




# పాక్ ఆక్రమిత కశ్మీర్ పోరు చేపట్టాలి !

కాశ్మీర్ లేకుంటే పాక్ బతుక జాలదు. రాజకీయాల్లో రాణించాలంటే కాశ్మీర్ అంశం కావాలి. కాశ్మీర్ అంశం లేకుంటే మిలిటరీని పట్టించుకోరు. కాశ్మీర్ లేకుంటే ఉగ్రవాదులు మనజాలరు. ఇన్నిరకాలుగా కాశ్మీర్‌తో పాక్ రాజకీయాలు ముడిపడి ఉన్నాయి. దీనంతటికీ విభజన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం, కాశ్మీర్ విషయంలో నెహ్రూ అనుసరించిన మెతకవైఖరి కూడా కారణం. ఆ తరవాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ దీనిని కొనసాగించడం వల్ల కూడా కాశ్మీర్ రావణ కాష్టంలా మారింది. భారత్‌లో అలజడి సృష్టించేందుకు పాక్ చేస్తున్న ప్రయత్నాలు ఈ నాటివి కాదు. భారత్ నుంచి విడివడ్డ నాటి నుంచి అంటే 1947 నుంచి కుట్రలు పన్నుతూనే ఉంది. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు సృష్టించి తీవ్రవాదులను దేశం దాటించాలని అక్కడి సైన్యం చూస్తోంది. సరిహద్దుల్లో తీవ్రవాదలును చొప్పించేందుకు సిద్దంగా ఉన్న పాక్ సైన్యం కాల్పుల ద్వారా తరచూ దృష్టి మరల్చేందుకు ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దులో పాకిస్థాన్ పదేపదే కాల్పులకు తెగబడుతున్న తీరు దాని కుత్సిత బుద్దికి నిదర్శనంగా చెప్పుకోవాలి. పాకిస్తాన్ ప్రజలను రెచ్చ గొట్టేందుకే కాశ్మీర్ విషయంలో ఎప్పుడూ వివాదం సృష్టిస్తూనే ఉంటారు. ఆక్రమిత కాశ్మీర్ ఇప్పటికీ ఈ సమస్య రాజుకుంటూనే ఉంది. దౌత్య పరంగా తప్పటడుగుల వేయడంతో భారత్‌కు తిప్పలు తప్పలేదు. ఇప్పటికైనా మోడీ దీని పరిష్కారాన్ని చేతల్లోకి తీసుకోవడం ద్వారా శాశ్వత పరిష్కారానికి తెగువ చూపారు. కాశ్మీర్‌లో జరుగుతన్న హింసాకాండ వెనక పాక్ ప్రోద్బలం నిరంతరాయంగా సాగడానికి కాంగ్రెస్ పాలకులు దోహదపడ్డారు. అందుకే 370 ఆర్టికల్ తరవాత కాశ్మీరీల్లో ఇప్పుడిప్పడే ఆత్మస్థయిర్యం వచ్చింది. బతకాడానికి అవకాశాలు వచ్చాయి. ఇంతకాలం ఉగ్రవాదులకు భయపడి బతికే వారు. ఇప్పుడే అక్కడా స్వేచ్ఛా పవనాలు వీచాయి. ఈ క్రమంలో దీనిని తట్టుకోలేని పాక్పహల్గామ్ దాడితో మల్లీ చిచ్చు రగిల్చే ప్రయత్నం చేసింది. అయితే దీనికి ప్రభుత్వం దీటైన జవాబివ్వడం ద్వారా గతంలో లాగా మీ ఆటలు సాగవని మోడీ ప్రభుత్వం తేల్చిచెప్పింది. 370 ఆర్టికల్ రద్దు తరవాత ప్రశాంతంగా ఉంటున్న కాశ్మీర్‌లో ఈ మధ్యకాలంలో మళ్లీ ఉగ్రవాదుల బరితెగింపు మొదలయ్యింది. పాక్‌లో ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదనడానికి ఇది నిదర్శనం. అడపాదడపా హిందువులు లక్ష్యంగా ఉగ్రమూకలు కాల్పులకు తెగబడుతూ ..పహల్గాం ద్వారా రక్తపుటేరులు పారించారు. కాశ్మీర్‌లో ప్రత్యేక హోదాను అడ్డం పెట్టుకుని అక్కడ రాచరికం అనుభవించిన అబ్దుల్లాలో, ముఫ్తీలు కూడా కాశ్మీర్‌లో తమ పెత్తనం కొనసాగేలా చూస్తుంటారు. కాశ్మీర్‌లో ఇప్పటికే 75శాతం పండిట్లను ఊచకోత కోసారు. ఉన్నవారు ఊరు విడిచి వెళ్లిపోయారు. దేశంలో ఎక్కడో ఓ చోట తలదాచుకుంటున్నారు. అయినా వారికి న్యాయం చేయాలన్న జ్ఞానం ఈ నేతలకు లేదు. కాశ్మీర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం అత్యావశ్యకం. అక్కడి అమాయక ప్రజలు ఉగ్రమూకల కారణంగా జీవితాలు కోల్పోరాదు. వారు ఏ మతం వారైనా సామాన్యులే అన్న విషయం గుర్తించాలి. అందుకే ఇక కాశ్మీర్ విషయంలో తేలాల్సింది పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య మాత్రమే. దీనిని అంతర్జాతయ సమస్యను చేయడం ద్వారా పాక్ పీచమణచాలి. కాశ్మీర్‌పై నానాయాగీ చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటూ భారత్‌ను చికాకు పెట్టే పాక్ కుతంత్రాలకు దీటుగా కఠినంగా జవాబివ్వాలి. పాక్ ఆక్రమిత కాశ్మీరీలు కూడా అక్కడ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతు న్నారు. తమను భారత్ కాశ్మీర్‌లో కలపాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ సమయంలో 370 ఆర్టికల్ రద్దు తరవాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలు స్వచ్ఛందగా అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే కాశ్మీర్‌లో ప్రశాంత పరిస్థితులకు కృషి చేస్తూనే ఆక్రమిత కాశ్మీర్ స్వాధీనానికి అడుగులు వేయాలి. పాక్‌ను దెబ్బ కొడుతూనే పివోకెను స్వాధీనం చేసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ఆగిపోలేదు కనుక ఏ మాత్రం తేడా వచ్చినా పాక్‌ను దెబ్బకొడుతూనే ఉండాలి. అలాగే దేశం యావత్తూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు స్వాగతించాలి. జమ్మూ-కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ స్వరాన్ని పెంచి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లక్ష్యంగా నినదించాలి. నిజానికి తమ అజెండా ఇక పాక్ ఆక్రమిత కాశ్మీర్ అని చెప్పడం ద్వారా సమస్యపై పాక్‌కు సవాల్ విసిరారు. కేంద్రం ఈ విషయంలో స్పష్టత ఇచ్చింది. ఉగ్రవాదం, పివోకెలే తమ అజెండా అని తేల్చింది. ఇంతకాలం కాశ్మీర్ సమస్యను అడ్డుగా పెట్టి అరాచకం చేస్తున్న పాక్‌కు కనువిప్పు కలిగించాలి. ఉగ్రవాదం ద్వారా భారత్‌ను అస్థిరపరిచి విచ్ఛిన్నం చేయాలని పాక్ కుట్ర పన్నుతోందని ప్రపంచం యావత్తూ గుర్తించిన నేపథ్యంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ ఎజెండాగా పనిచేయాలి. 370 రద్దు తర్వాత ఇప్పుడు పీవోకే ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పాక్ అక్రమ కబ్జా నుంచి పీవోకేకి విముక్తి కల్పించి, భారత్‌లో అంతర్భాగంగా మార్చాలన్న వారి కలను సాకారం చేయాలి. పీవోకే రాజధాని ముజఫరాబాద్‌ను మనం స్వేచ్ఛగా సందర్శించే రోజు రావాలని ప్రార్థిద్దాం. ఇదే క్రమంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజల అణచివేతపై పోరాడాలి. అలాగే మన కాశ్మీర్‌లో అశాంతి రాజేస్తున్న ఉగ్రమూకలను చీల్చి చెండాడాలి. పరిస్థితులు ఏమాత్రం చేయి దాటిపోకుండా భద్రతా బలగాలు కృషి చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా పాక్ తన ప్రేలాపనలు ఆపడం లేదు. మొత్తంగా కశ్మీర్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు కొన్నేళ్లుగా కేంద్రం తీసుకున్న చర్యలు విఫలం అయ్యేలా స్థానిక నేతలు, పాక్ ప్రేరేపిత సంస్థలు పనిచేస్తూ వచ్చాయి. మరోమారు కాశ్మీర్‌లో వేలుపెట్టకుండా పాక్‌కు గట్టి బుద్ది చెప్పాలి. అలాగే కాశ్మీర్‌లో ఉగ్రమూకల ఏరివేతను మరింత సవాల్‌గా తీసుకోవాలి. అక్కడ ఉగ్రవాదులు కాలుపెట్టకుండా కఠినంగా వ్యవహరించాలి. ఉగ్రమూక లకు అండగా నిలుస్తున్న వారు ఎంతటి వారైనా బుద్ది చెప్పాలి. స్థానికమప్రజల అండ లేకుండా చేయాలి. నాయకులైతే కోర్టు బోనులో నిలబెట్టాలి. వారికి ఆశ్రయం కల్పిస్తున్న వారిని గుర్తించి వారిని కూడా ఏరిపడేయాలి.

# పాక్‌కు గూఢచర్య సేవలు

### యూట్యూబర్ సహా ఆరుగురి అరెస్ట్






**న్యూఢిల్లీ, మే 17:** ఇంటిదొంగలు పట్టుబడ్డారు. గూఢచర్యం కేసులో యూట్యూబర్ అరెస్ట్ అయ్యారు. పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ.. భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలపై హరియాణాలో ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఒక మహిళా యూట్యూబర్ కూడా ఉన్నారని శనివారం వెల్లడించారు. వీరంతా పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐకు చెందినవారితో తరచూ సంప్రదింపులు జరుపుతున్నారని, శత్రుదేశానికి సున్నితమైన సమాచారం చేరవేస్తున్నారని తెలిపారు. ఆ ఆరుగురిని హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి అదుపులోకి తీసుకున్నారు. హిస్సార్ ప్రాంతం నుంచి అరెస్టయిన మహిళా యూట్యూబర్ పేరు జ్యోతి మల్హోత్రా అని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం న్యాయస్థానం ఆమెకు ఐదురోజుల పోలీసు రిమాండ్ విధించింది. ఆమె ఒక ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్. ఆమె పాక్‌లో పలుమార్లు పర్యటించారు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మెసేజింగ్‌లో పాక్ వ్యక్తులతో దేశ భద్రతకు ముప్పు తెచ్చే సమాచారాన్ని చేరవేసిందని అధికారులు ఆరోపించారు. 2023లో పాక్‌కు వెళ్లిన బృందంలో తనను కూడా ఎంపిక చేశారని, అప్పుడు అహ్సన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను కలిశానని విచారణలో అంగీకరించినట్లు చెప్పారు. భారత్‌కు వచ్చిన తర్వాత అతడితో సంప్రదింపులు కొనసాగించింది. అహ్సన్ సూచన మేరకు ఆమె.. అలీ అహ్సన్ అనే వ్యక్తిని కలుసుకుంది. పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను ఆమెకు అతడు పరిచయం చేశాడని సమాచారం. ఎవరి కంటాపడకుండా ఉండేందుకు తన పాకిస్థానీ కాంటాక్ట్‌ల వివరాలను ఇతర పేర్లతో సేవ్ చేశానని ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమె నిరంతర సంబంధాలు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుందని పోలీసులు వెల్లడించారు. ఆమె పంపిన సమాచారం, ఇతరుల ప్రమేయం గురించి అధికారులు ఆరా తీస్తున్నారు.కాగా.. అరెస్టయిన వారిలో పటియాలలోని ఖల్సా కళాశాలలో చదువుతోన్న దేవేంద్ర సింగ్ ధిల్లాన్ కూడా ఉన్నాడు. మే 12న తన ఫేస్‌బుక్ ఖాతాలో గన్, పిస్టోల్ చిత్రాలను పోస్టు చేశాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతడిని విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గతేడాది నవంబరులో కర్తార్‌పూర్ కారిడార్ ద్వారా పాక్ (శీషశ)కు వెళ్లి అక్కడి ఇంటర్ సర్వీసెస్ ఇం-టె-లిజెన్స్ ఏజెన్సీ అధికారులతో భారత్‌కు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు- అంగీకరించాడు. అందుకు పాక్ అధికారులు పెద్దమొత్తంలో డబ్బు ముట్టజెప్పినట్లు- తెలిపాడు. పటియాలా మిలిటరీ కంటోన్మెంట్‌కు సంబంధించిన చిత్రాలను సైతం అతడు పాక్ అధికారులకు అందించాడని తెలుస్తోంది.

# భారత్ దాడులతో తీవ్రంగానే నష్టపోయాం

### ఎట్టకేలకు అంగీకరించి పాక్ ప్రధాని



**ఇస్లామాబాద్, మే 17:** భారత్ దాడులపై పాకిస్తాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇన్ని రోజులు బుకాయించిన పాక్.. భారత్ దాడులు చేసిందని ఒప్పుకుంది. శుక్రవారం ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాక్ ప్రధాని షరీఫ్ ప్రసంగిస్తూ.. నూర్ ఖాన్‌తోపాటు- పలు వైమానిక స్థావరాలపై భారత్ దాడులు జరిపిందని అంగీకరించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారత్ ఖచ్చితమైన దాడులు జరిపినట్లు ధృవీకరించారు. భారత ఆపరేషన్ ప్రారంభమైన కొన్ని క్షణాల తర్వాత, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తనను తెల్లవారుజామున 2.30 గంటలకు నిద్రలేపారని షరీఫ్ అన్నారు. జనరల్ మునీర్.. నాకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి దాడుల గురించి తెలియజేశారు. ఇది తీవ్ర ఆందోళన కలిగించే క్షణం. ఆ సమయంలో మా వైమానిక దళం స్థానిక సాంకేతిక పరిజ్ఞానం, చైనీస్ యుద్ధ విమానాలను వినియోగించిందని షరీఫ్ చెప్పారు. కాగా, బిజెపి జాతీయ ఐటీ- విభాగం చీఫ్ అమిత్ మాల్వియా.. పాక్ ప్రధాని మాట్లాడిన వీడియో ఎక్స్ లో పోస్ట్ చేస్తూ.. ఇది ఆపరేషన్ సిందూర్.. ధైర్యం, సామర్థ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. సిందూర్‌తో ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే. పహల్గాం ఉగ్రదాడికి 'ఆపరేషన్ సిందూర్' తో పాక్ పై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుంది. ఆ దేశంలోని ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడితో తోకముడిచిన దాయాది.. చివరికి కాళ్లబేరానికి వచ్చింది. అయితే, ఇన్నాళ్లూ తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకుంటూ వస్తోన్న పాక్.. తాజాగా దాన్ని అంగీకరించింది. తమ కీలక ఎయిర్‌బేస్‌లపై భారత్ వైమానికి దాడులు జరిపిందని ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మీడియా సాక్షిగా ఒప్పుకున్నారు. మే 10 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తమ కీలకమైన వైమానిక స్థావరాలపై భారతదేశం జరిపిన ఖచ్చితమైన దాడులను ధ్రువీకరించారు.

# కశ్మీర్ అంశమే పాక్ జీవనాడి

### అది లేకుంటే అక్కడ ఆర్మీ లేదు

### భారత ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్



**న్యూఢిల్లీ, మే 17:** ఆర్థిక పరంగానే కాదు.. పాకిస్థాన్ అన్ని విధాలుగా పతనమైన దేశమని ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.పాక్ అబద్ధాల పుట్ట అని.. వాళ్లను అస్సలు నమ్మొద్దని చెప్పారు. ఆ దేశాన్ని ప్రభుత్వం కాదు.. ఆర్మీనే నడుపుతోందన్నారు. అన్ని విధాలుగా పతనమైన పాక్‌ను కశ్మీర్ అంశమే ఐక్యతగా ఉంచుతోందన్నారు. అన్ని సమస్యల్ని కప్పిపుచ్చుకోవడానికి కశ్మీర్‌ను ఒక ఆయుధంగా అక్కడి నేతలు, ఆర్మీ మలచుకుందన్నారు. భారత్ ఎంత శక్తిమంతమైన దేశం, మనం ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామో మొత్తం ప్రపంచం ఇప్పుడు అర్థం చేసుకుంటోందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనికాధికారులు ఇచ్చిన ఫస్ట్ బ్రీఫింగే దీనికి సరైన ఉదాహరణ అని ఆయన మెచ్చుకున్నారు. విదేశీ వ్యవహారాల శాఖ సెక్రెటరీతో కలసి ఇద్దరు మహిళా అధికారులు మాట్లాడిన తీరు, ఆపరేషన్ సిందూర్ గురించి వివరించిన విధానం అదిరిపోయిందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ చుక్కలు చూపించింది భారత్. పహల్గాం దాడి దరిమిలా టెర్రరిస్టులతో పాటు- వారికి అండగా ఉంటు-న్న శత్రుదేశంపై ఉరుములా విరుచుకుపడుతోంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రస్థావరాల మీద అటాక్ చేయడం, ఆ తర్వాత ప్రతిదాడులకు తెగించిన పాక్‌పై డ్రోన్లు, మిసైళ్లతో ఇండియా ఓ రేంజ్‌లో విరుచుకుపడటం ప్రపంచదేశాలు కూడా చూశాయి. తమ జోలికొస్తే తాటతీస్తామంటూ భారత్ చేసిన సింహగర్జన పాక్‌తో పాటు- ఆ దేశానికి సాయం చేస్తున్న టర్కీ, అజర్‌బైజాన్, చైనాకూ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. యుద్ధంతోనే కాదు దౌత్యంతోనూ పాక్‌ను ఇబ్బందులపాలు చేస్తోంది ఇండియా. వాళ్ల అసలు రూపాన్ని ప్రపంచ దేశాల ముందు బయటపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ సమయంలో భారత ఆర్మీ మాజీ చీఫ్ నిర్మల్ చందర్ విజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కశ్మీరే పాక్ ఆయుధమని అన్నారు.

# పాక్ దుర్నీతిని ఎండగట్టేందుకు దౌత్యనీతి

### విదేశాలకు వివరించేందుకు రంగం సిద్ధం

### ఏడుగురు ఎంపీలతో ఏడు బృందాల ఏర్పాటు

### శశిథరూర్, కనిమొళి, సుప్రియా సూలెకు చోటు

**న్యూఢిల్లీ,మే17:** భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతోన్న పాకిస్థాన్‌ను అంతర్జాతీయంగా ఏకాకిని చేసేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కొందరిని ఎంపిక చేసింది. వీరంతా వివిధ దేశాలకు వెళ్లి పాక్ ఉగ్ర కుట్రలను వివరిస్తారు. ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం కేంద్రం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఈ ఏడుగురిలో ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) సంజయ్ కుమార్ ఝూ(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసే)లు ఉన్నారు. వీరంతా విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. ఈ బృందాలు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించ నున్నారు. భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరించడం, భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత ఇవ్వనున్నారు. అలాగే ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం చేస్తారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును కూడా ఈ సందర్భంగా వివరించడం జరుగుతుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక వివరణ ఇచ్చింది. ఆ ప్రతినిధుల బృందాలకు ఏడుగురు ఎంపీలు నాయకత్వం వహిస్తుండగా.. వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శశిథరూర్ కూడా ఉన్నారు. అయితే కాంగ్రెస్ పంపిన జాబితాలో అసలు థరూర్ పేరు లేకపోవడం గమనార్హం.



పాక్‌ను ఎండగట్టేందుకు పంపే బృందం కోసం పేర్లు పంపాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు మే 16న కాంగ్రెస్‌ను కోరగా, అదేరోజున కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నాలుగు పేర్లు పంపారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి ఆనంద్ శర్మ, రాజ్యసభ ఎంపీ డాక్టర్ సయ్యద్ నజీర్ హుస్సేన్, లోక్‌సభ ఎంపీ రాజా బ్రార్, మరో నేత గౌరవ్ గొగొయ్ ఉన్నారని ఆ పార్టీ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఆ జాబితాలో థరూర్ పేరు లేదు. అయితే శనివారం కేంద్రం విడుదల చేసిన తుది జాబితాలో వారి పేర్లేవీ లేవు. కానీ తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు మాత్రం అనూహ్యంగా చోటు- దక్కింది. ఇటీవలి పరిణామాలపై దేశం విధానాన్ని వివిధ దేశాలకు వివరించేందుకు వెళ్తున్న బృందానికి నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ప్రయోజనాలతో ముడిపడిన సందర్భాల్లో అక్కడ నా అవసరం ఉంటే.. నేను అందుబాటులో ఉంటా. జైహింద్ అని థరూర్ ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
18 మే 2025
హైదరాబాద్






# ఆపరేషన్ సిందూర్‌తో భారత శక్తి చాటింది

**జిల్లా ఐఎంఏ ఆధ్వర్యంలో వేములవాడలో ఘనంగా తిరంగా ర్యాలీ**

**ప్రజానావ, వేములవాడ:** భారత రక్షణ శక్తిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగియడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో శనివారం 'తిరంగా ర్యాలీ' నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి ప్రారంభమైన పట్టణ పురవీధుల గుండా దేవాలయ వీధి మార్గాల్లో సాగి, రాజన్న ఆలయ ప్రధాన ద్వారం ముందు ముగిసింది. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, నర్సులు, లయన్స్ క్లబ్ సభ్యులు, న్యాయవాదులు, అవోపా, సామాజిక కార్యకర్తలు పెద్దఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వైద్యులు మాట్లాడుతూ భారత సైన్యం చూపించిన సాహసం, సమర్థత దేశాన్ని గర్వపడేలా చేసింది. దీనిని అభినందిస్తూ ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత జాతి ఖ్యాతి ప్రపంచాన్ని చాటిందని వారు అభిలాషించారు. దీంతో దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పిస్తున్న సైనికులకు వందనం చెప్పే కార్యక్రమంగా ఈ ర్యాలీ నిలిచింది. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డా. శ్రీనివాస్, ఐఎంఏ వైస్ ప్రెసిడెంట్ డా.చీకోటి సంతోష్ కుమార్, ఐఎంఏస్ సెక్రటరీ డా.అభినయ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫాగ్సీ చైర్మన్ డా. పద్మలత, సీనియర్ వైద్యులు డా.మనోహర్, డా.ఆనంద్ రెడ్డి, డా.అనిల్, డా. సంతోషాచారి, డా.సంధ్య, డా.తిరుపతి, డా.ప్రదీప్, డా.సింధు, డా.మహేందర్, డా.వర్షా రెడ్డి డా.రాజేందర్, డా.కీర్తి ప్రియ, డా.సంధ్య, లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కటకం శ్రీనివాస్, ఆవోప ప్రెసిడెంట్ శ్రీనివాస్, అడ్వకేట్ సభ్యులు మహేశ్, బార్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ కిషోర్, కటకం జనార్ధన్, నిమ్మశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి

**రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**ప్రజానావ, సిరిసిల్ల:** రాబోయే వానాకాలంలో జిల్లాలో డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ (సీజనల్ వ్యాధులు) ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని సన్నద్ధం కావాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ప్రతి గ్రామంలో, ప్రతి మున్సిపల్ వార్డులో నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని, నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా నియంత్రణ చర్యలు చేపట్టి రాకుండా చూసుకోవడం ఉత్తమం అని కలెక్టర్ తెలిపారు. ఇండ్లలో ఉన్న నీటి నిల్వలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, అనంతరం అక్కడ నీరు నిల్వ ఉ ఒడకుండా అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, ప్రతి మంగళ, శుక్ర వారాల్లో డ్రైడే కార్యక్రమంలో వాటర్ లాగిన్ పాయింట్ల మరమ్మతునకు ఉపాధి హామీ నిధులు వినియోగించుకొని పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి వారం నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించాలని, నీరు అధికంగా నిల్వ ఉన్న ప్రాంతాల్లో కీటక నాశన, యాంటీ లార్వా స్ప్రే చేయాలన్నారు.



గ్రామాల్లో ఉన్న డ్రైయిన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాలతో అవసరమైన మేర ఆయిల్ బాల్ తయారుచేసి సన్నద్ధం కావాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అక్కడ అధికంగా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రత , దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామ సభల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో కరపత్రాలు, చెత్త సేకరణ వాహనాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని, వైద్య సేవలతో పాటు అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపించాలని అన్నారు.

**పీహెచ్‌సీల వద్ద డెంగ్యూ ర్యాపిడ్ టెస్టులు**

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డెంగ్యూ ర్యాపిడ్ టెస్టులు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కూలిపోయే స్థితిలో ఉన్న పాడైపోయిన భవనాలు, పాతబడిన భవనాలను తొలగించాలని ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రై డే కార్యక్రమం కింద నిల్వ ఉన్న నీరు తొలగించాలని, ఇంటిలో నీరు నిల్వ ఉంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గ్రామాల్లో పట్టణాల్లో ఫాగింగ్ యంత్రాల పనితీరును పరిశీలించి వాటిని బాగు చేసి రెగ్యులర్ ఫాగింగ్ నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.రజిత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫుద్దీన్, ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలు సంబంధిత వైద్య అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు, జరిమానా

**ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు**

**ఎస్పీ మహేశ్ బీ గితే**



**ప్రజానావ, సిరిసిల్ల:** జిల్లావ్యాప్తంగా గడిచిన నాలుగు నెలల్లో వివిధ పోలీస్ స్టేషన్లలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 2161 మంది మందుబాబులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టు ద్వారా జరిమానాలు, 43 మందికి జైలు శిక్షలు విధించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తరుచూ పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుపడితే వారి తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు. తాగి వాహనాలు నడపవద్దని తద్వారా జరిగే ప్రమాదాలను కుటుంబ ఆర్థిక పరిస్థితులు చితికిపోయే అంశాలపై పోలీస్ శాఖ కౌన్సిలింగ్ ద్వారా వివరిస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.



# రోడు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజానావ, వేములవాడ:** ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలం కొలనూరుకు చెందిన కూన తిరుపతి వేములవాడ నంది కమాన్ పెట్రోల్ బంక్ వద్ద తన వాహనంపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ రెండో డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# అనాథలకు ఆరోగ్యశ్రీ కార్డులు

**ప్రజానావ, ఖైరతాబాద్:** రాష్ట్రంలో తొలిసారిగా అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ కార్డులను ఇస్తున్నామని, ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులున్నా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందుకునేలా ఈ కార్డు పనిచేస్తుందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ఆమె బేగంపేట- టూరిస్ట్ ప్లాజాలో జరిగిన 'అనాథ చిన్నారులకు, అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిశు విహార్ సంరక్షణలో ఉన్న అనాథ చిన్నారులకు ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దుర్శెట్టి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ రాజన్న ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయాన్నే ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి కోడె మొక్కులు చెల్లించి, స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శనివారం ఒక్కరోజే 47,299 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- ప్రజానావ, వేములవాడ





అంబర్‌పేట డివిజన్ ప్రేమ్ నగర్‌లో నాలాలు నిండిపోవడంతో కార్పొరేటర్ ఈ.విజయ్ కుమార్ గౌడ్ శనివారం సంబంధిత సిబ్బందిని పిలిచి చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బస్తీ ప్రజలతో కలిసి ప్రేమనగర్‌లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ వెంట బస్తీ ప్రజలతో పాటు బీఆర్ఎస్ నాయకులు హనుమంత్ చారి, మన్వాడ బాలరాజ్, సంతోష్ చారి, గౌస్, నాగయ్య వినయ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

- ప్రజానావ, అంబర్‌పేట

# హైదరాబాద్ మహానగరంపై సీఎం పగబట్టారు

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ప్రజానావ, ఖైరతాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ మహానగరంపై పగ బట్టారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూసీ, హైడ్రా పేరిట ఇప్పటికే హైదరాబాద్‌లో సీఎం సమస్యలు సృష్టించారు.. ఇపుడు మెట్రో రైలు ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపారని మండిపడ్డారు. ప్రతి మెట్రో ప్రయాణికుడిపై నెలకు రూ.600 కనీస భారం పడుతుందన్నారు. కొన్ని మహానగరాల్లో మెట్రో ఛార్జీలు పెంచితే ప్రయాణికులు తిరగబడితే పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని.. తక్షణమే మెట్రో ఛార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌ను తిరోగమనం వైపు తీసుకెళ్లే ఏ నిర్ణయం మంచిది కాదన్నారు. ప్రజా రవాణాకు ఎన్ని సబ్సిడీలు ఇచ్చినా తక్కువేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అసలే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, రిజిస్ట్రేషన్ ఆదాయం నెలకు రూ.200 కోట్ల మేర తగ్గిందన్నారు. కొంతకాలం నష్టమైనా మెట్రో ఛార్జీలు పెంచకూడదన్నారు. ప్రతిపాదించిన కొత్త మెట్రో మార్గాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా మెట్రో ఛార్జీలు పెంచలేదని.. కరోనా సమయంలో మెట్రో రైలు నష్టాల్లో నడిచినా కేసీఆర్ ఛార్జీల పెంపు నిర్ణయానికి ఒప్పుకోలేదని గుర్తుచేశారు.

# భూ భారతిలో ప్రభుత్వ స్వార్థం లేదు

- భూములకు బౌండరీ, మ్యాప్ లేకపోవడంతోనే భూ సమస్యలు
- ధరణిలో ఏ సమస్య వచ్చినా కోర్టుకు పోవాల్సి వచ్చేది
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజానావ, మెదక్:** భూ భారతి చట్టంలో ప్రభుత్వ స్వార్థం ఎంత మాత్రం లేదని.. రైతుల శ్రేయస్సు కోసమే తీసుకువచ్చారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా చిలప్ చేడ్ మండలం శీలం పల్లి రైతు వేదిక వద్ద భూభారతి చట్టం సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మినిస్టర్ గా నేను మా స్వార్థం కోసం ఈ చట్టాన్ని చేయలేదు 18 రాష్ట్రాల్లో ఉన్న రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి అందులో ఉన్న ముఖ్యమైన అంశాలను తీసుకుని వేలాదిమంది అభిప్రాయాలను తీసుకొని మీరు నచ్చిన, మెచ్చిన చట్టమే భూ భారతి చట్టం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆనాడు ధరణి చట్టాన్ని తీసుకు వచ్చారు కానీ సమస్యలు వస్తే దాన్ని పరిష్కరించే మార్గం చూప లేదన్నారు దానికి కారణంగా భూములున్న ఆసాములు ఇబ్బంది పడ్డారని తెలిపారు. రైతుల భూ సమస్యలు గుర్తించే ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. మనిషికి ఆధార్ ఎలా ఉంటుందో అదే విధంగా భూదాన్ కూడా ఈ చట్టంలో పెట్టడం జరిగిందన్నారు.

### ఇకనుంచి రిజిస్ట్రేషన్ సమయంలోనే..

ఎక్కువగా భూములకు బౌండరీ లేకపోవడం, మ్యాప్ లేకపోవడం వల్ల భూ సమస్యలు తలెత్తాయన్నారు. భూ భారతి చట్టంలో సర్వే చేసి మ్యాపులు ఇచ్చి పాస్ బుక్ లో అప్లోడ్ చేస్తే శాశ్వతంగా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సర్వే నంబర్ కి గాని, ఆ ఖాతాకి గాని భవిష్యత్తులో ఎప్పుడు ఇబ్బందులు రావని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే రోజుల్లో రిజిస్ట్రేషన్ టైం లోనే భూములకు సర్వే మ్యాప్ రిజిస్ట్రేషన్ తో పాటు మీ పాస్ బుక్ లో కానీ మీ డాక్యుమెంట్ లో కానీ అప్లోడ్ చేసే కార్యక్రమాన్ని ఈ చట్టంలో ప్రవేశపెట్టామని తెలిపారు. భూ భారతి చట్టంలో రైతులకు డాక్యుమెంట్ సాఫ్ట్ కాపీ తో పాటు హార్డ్ కాటు కూడా అందించి జమాబంది కార్యక్రమాన్ని కచ్చితంగా ఏర్పాటు చేస్తామన్నారు. చిలప్ చేడ్ మండలంలో ఉన్న 16 రెవెన్యూ గ్రామాల్లో 1000 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిష్కరించే విధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. భూ భారతి కోసం నాలుగు పైలెట్ మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ మండలాల్లో వచ్చిన దరఖాస్తుల్లో సాదా బైనామ కాకుండా మిగతా అంశాలన్నింటినీ జూన్ రెండు నాడు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

### భూతగాదాలున్న మాట వాస్తవమే..

ప్రభుత్వ ప్రైవేటు ఫారెస్ట్, రెవెన్యూ, దేవాలయాలకు సంబంధించిన కొన్ని భూతగాదాలున్న మాట వాస్తవమని భూ సమస్యలు ఎక్కడైతే ఉన్నాయో అక్కడ ప్రత్యక్షంగా సర్వే చేసి శాశ్వతంగా ఆ భూ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజ్ కు సూచన చేశారు. ధరణిలో ఏ సమస్య వచ్చినా సివిల్ కోర్టుకు పోవాల్సి వచ్చేదని కానీ భూ భారతిలో ఎమ్మార్వో, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్ సీసీఎల్ ఏ స్థాయిలో తప్పు జరిగితే ఆ స్థాయిలో అప్పీల్ కు వెళ్లే అవకాశం ఈ చట్టంలో వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. అంతే కాకుండా ప్రత్యేకంగా ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాడు ప్రతి రెవెన్యూ గ్రామానికి ఎమ్మార్వో స్థాయి అధికారులతో వారి టీం మీ గ్రామానికి వస్తుందని భూ భారతికి చట్టానికి సంబంధించి రెండు రోజుల ముందే మీకు దరఖాస్తు ఫారాలు ఇస్తారని మీ సమస్యలు ఇచ్చేసి అధికారులకు ఇస్తే మీ సమస్యను మీ గ్రామంలో పరిష్కరించే విధంగా చూడడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరు భూభారతి చట్టం గురించి అభద్రతకు గురికా వద్దన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మత్స్య శాఖ చైర్మన్ మెట్టు సాయి, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి మెదక్ ఆర్డీఓ రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి, నర్సాపూర్ తహసీల్దార్లు శ్రీనివాస్, ఆంజనేయులు సహదేవ్ ఆర్ఐలు శ్రీహరి, సునీల్ చవాన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, పాల్గొన్నారు. అంతకుముందు జగిత్యాల, సంగారెడ్డి జిల్లాల్లోని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన పలు మండలాల్లో రెవెన్యూ సదస్సులకు మంత్రి హాజరయ్యారు.

## ప్రపంచ రక్తపోటు దినోత్సవం



**ప్రజానావ, బెల్లంపల్లి:** బెల్లంపల్లి ఆసుపత్రిలో శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి ఏరియా హాస్పిటల్ డివైసీఎంఓ డాక్టర్ ఎం మధు కుమార్ హాజరై మాట్లాడారు. మంచి ఆరోగ్య జీవన విధానం మధుమేహం వ్యాధిని దరిచేరదీయదన్నారు. అధిక రక్త పోటు వలన సింగరేణిలో చాలామంది కార్మికులు కార్మిక కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు అని అన్నారు. రక్తపోటు వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రక్తపోటును అరికట్టడానికి నూనె పదార్థాలు,కొవ్వు పదార్థాలు అధికంగా తీస్కోకూడదని, అలాగే మద్యపానానికీ కూడా దూర%శీ%గా ఉండాలని కోరారు. ప్రపంచ నర్సుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ స్టాఫ్ నర్స్ గా ఎన్నికైన బీ రసరంజని కుమారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రతినిధులు డీఆర్ శ్రీధర్, ఫిట్ సెక్రటరీ అన్వేష్, కమిటీ సభ్యులు, ఇతర యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజానావ, తాండూర్:** తాండూర్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని తాండూర్, ఐబీ ఏరియా, మాదారం, కొత్తపల్లి, బోయపల్లి, చౌటపల్లి, ద్వారకాపూర్, కాసిపేట,మాదారం 3ఇంక్లైన్, నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం ఉదయం 8:30 గంటల నుండి 9:30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు తాండూర్ ట్రాన్స్ కో ఏఈ జాన్ ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్తు సరఫరాను నిలిపి వేస్తున్నట్లు, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

## అందాల పోటీల పేరిట ప్రజాధనం వృధా



**ప్రజానావ, బెల్లంపల్లి:** అందాల పోటీల పేరిట కాంగ్రెస్ప్రభుత్వం ప్రజాధనం వృధా చేస్తున్నదని ఎంసీపీఐయూ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఆరోపించారు. శనివారం బెల్లంపల్లిలోని ఎంసీపీఐయూ ఆఫీస్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా ఎన్నికల హామీలను నెరవేర్చకుండా, అందాలపోటీల పేరుతో కోట్లాది రూపాయలు వృథా చేస్తున్నదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్,బెల్లంపల్లి మండల కార్యదర్శి ఆరెపల్లి సతీష్, తోగరి రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

## క్షతగాత్రుడికి ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజానావ, ఉట్నూర్:** ఉట్నూర్ మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన అందులపల్లి సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ లోని వెల్ నెస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. అనంతరం సురేష్ కుటుంబ సభ్యులకు వెడ్మ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి,సురేష్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

## పాము కాటుతో మహిళ మృతి



**ప్రజానావ, కౌటాల:** మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన దుర్గం ప్రియాంక (26)పాముకాటుకు గురై శుక్రవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. పాము కాటుకు గురైన ఆమెను కాగజ్ నగర్ లోని హాస్పిటల్లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భర్త ప్రశాంత్ ఫిర్యాదు చేశాడన్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం



- జూన్ మొదటివారంలో ఉండే అవకాశం
- వివిధ సమీకరణాలతోనే జాప్యం
- మంత్రి కొండా సురేష చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారు
- బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజానావ, ఖైరతాబాద్:** తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. రేవంత్ ఏడాది పాలన పూర్తిచేసుకున్న సమయంలోనే మంత్రివర్గ విస్తరణ దిశగా కసరత్తు జరిగింది. అయితే, సమీకరణాలు.. ఎంపిక విషయంలో స్పష్టత లేకపోవడంతో వాయిదా పడింది. అప్పట్లోనే మంత్రులుగా పేర్లు ఖరారైనట్లు ప్రచారం సాగింది. ఇక, ఇప్పుడు మంత్రివర్గ విస్తరణకు పార్టీ అధినాయకత్వం ఆమోద ముద్ర వేసింది. కొత్తగా అవకాశం ఇవ్వాల్సిన పేర్లను ఖరారు చేసింది. ప్రస్తుత మంత్రివర్గంలో ఒకరిని తప్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. పలువురి శాఖల్లో మాత్రం మార్పులు జరగనున్నాయి.

### టీపీసీసీ చీఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు

మంత్రివర్గ విస్తరణపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ నెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. వివిధ సమీకరణాల వల్లే మంత్రివర్గ విస్తరణలో కొంతమేర జాప్యం జరుగుతోందని చెప్పారు. తమ ప్రభుత్వంలో మంత్రులు అందరూ కలిసే ఉన్నారని కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉన్న అవసరాలు తీర్చడమే తమ ప్రభుత్వం ముందున్న లక్ష్యమని స్పష్టం చేసారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇదిలాఉంటే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై సైబర్ క్రైమ్‌లో కేసు పెడతామని హెచ్చరించారు. ఈ నెల 26, 27 తేదీల్లో టీపీసీసీ కార్యవర్గం ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో సీఎం మార్పు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారమేనని విమర్శించారు. బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని ఆరోపించారు. మహిళా కాంగ్రెస్ ఆందోళన సర్వ సాధారణం, మహిళలకు కాంగ్రెస్‌లో ఉన్న ప్రాధాన్యం మరే పార్టీలో లేదని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఇక, మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్ వద్ద ఇప్పటికే చర్చలు జరిగాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరుపై రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. కాగా, రాజగోపాల్ తో పాటుగా వివేక్ కు పార్టీలో చేరే సమయంలోనే హామీ ఇచ్చిన విషయాన్నినేతలు గుర్తుచేశారు.

### వీరికే ఛాన్స్?

మంత్రివర్గంలో నిజామాబాద్ నుంచి సుదర్శన్ రెడ్డి పేరు ఖాయంగా కనిపిస్తోంది. అదిలాబాద్ నుంచి గడ్డం వినోద్‌కు పదవి ఇస్తారనే ప్రచారం సాగుతోంది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉండడంతో రాజగోపాల్‌కు ఇప్పుడే ఛాన్స్ ఇస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది. రంగారెడ్డి నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. ముదిరాజ్ వర్గానికి మంత్ రివర్గంలో అవకాశం ఇస్తే మహబూబ్ నగర్ కు చెందిన శ్రీహరి పేరు రేసులో ఉంది. ఇక సీఎం వద్ద పలు కీలక శాఖలు ఉన్నాయి. విద్య, హోం, గనులు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కీలక శాఖలు ఉన్నాయి. దీంతో కొత్తగా వచ్చే వారికి ఈ శాఖలు కేటాయిస్తారనే అంచనాలున్నా.. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరి శాఖల సర్దుబాటు ఉంటుందనే వాదన కాంగ్రెస్ నేతల్లో వినిపిస్తోంది.



# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

ఆదివారం 18 మే 2025 | హైదరాబాద్







## నీరజ్ చోప్రా ఖాతాలో మరో రికార్డ్

### 90 మీటర్ల మార్క్‌ను అధిగమించిన నీరజ్

దోహా: భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరో సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. తొలిసారి తన కెరీర్ లోనే 90 మీటర్ల మార్క్‌ను అధిగమించాడు. ఖతార్ వేదికగా జరుగుతున్న దోహా డైమండ్ లీగ్‌లో ఈ ఘనత సాధించాడు నీరజ్. నీరజ్ కెరీర్‌లో ఇది అత్యుత్తమ త్రో. అంతకుముందు, టోక్యో ఒలింపిక్స్‌లో నీరజ్ చోప్రా బంగారు పతకం గెలుచుకున్నప్పుడు కూడా అతను 90 మీటర్లు త్రో వేయలేకపోయాడు.నీరజ్ కెరీర్‌లో అత్యుత్తమ త్రో 2022 స్టాక్‌హోమ్ డైమండ్ లీగ్‌లో అతను చేసిన 89.94 మీటర్లు. ఐదు రౌండ్లు ముగిసిన తర్వాత కూడా నీరజ్ చోప్రా రెండవ స్థానంలో నిలిచాడు.డైమండ్ లీగ్ దోహా లెగ్‌లో జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ నంబర్ వన్ స్థానంలో నిలిచాడు. ఐదవ ప్రయత్నంలో అతను 91.06 మీటర్లు విసిరాడు.రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ మొదట విసిరాడు. అతను తన మొదటి ప్రయత్నంలోనే 88.44 మీటర్లు విసిరాడు. అతని ప్రత్యర్థి అండర్సన్ పీటర్స్ మొదటి ప్రయత్నంలోనే 85.64 మీటర్లు విసిరగా, జూలియన్ వెబర్ 83.82 మీటర్లు, జూలియస్ యెగో 68.81 మీటర్లు విసిరారు. అదే సమయంలో, మరో భారతీయ జావెలిన్ త్రోయర్ కిషోర్ జెనా మొదటి ప్రయత్నంలోనే 68.07 మీటర్లు విసిరాడు.నీరజ్ చోప్రా జావెలిన్ త్రోలో 90 మీటర్లు విసిరిన ప్రపంచంలో 25వ ఆటగాడిగా.. ఆసియాలో మూడవ ఆటగాడిగా నిలిచాడు. రెండు ఒలింపిక్ పతకాలు గెలుచుకున్న నీరజ్ చోప్రా ప్రస్తుత కోచ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాన్ జెలెంజీ, 90 మీటర్ల కంటే ఎక్కువ విసిరిన జావెలిన్ త్రోయర్ల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. జావెలిన్ త్రోలో 90 మీటర్లు విసిరిన ఇతర ఆసియా అథ్లెట్లు ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ (92.97) (పాకిస్తాన్) చావో సన్ చెంగ్ (91.36) మాత్రమే. 90 ప్లస్ మీటర్లు విసిరి నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

### నీరజ్ చోప్రాను అభినందించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: దోహా డైమండ్ లీగ్‌లో భారత 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా శుక్రవారం తొలిసారిగా జావెలిన్‌ను 90 మీటర్లకు మించి విసిరి చరిత్ర సృష్టించాడు. ఫైనల్‌లో తన మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 90.23 మీటర్లు విసిరి తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరుచుకున్నాడ. అంతకు ముందు నీరజ్ చోప్రా జూన్ 30, 2022న స్టాక్‌హోం డైమండ్ లీగ్‌లో 89.94 మీటర్లు విసిరాడు. అయినా నీరజ్ చోప్రా రెండో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. జర్మనీ క్రీడాకారుడు జులియన్ వెబర్ తన చివరి ప్రయత్నంలో 91.06 మీటర్లు విసిరి మొదటి స్థానంలో నిలిచాడు. దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్ చోప్రా అద్భుతమైన ప్రదర్శనను కనబరిచినందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఆయనను ప్రశంసించారు. నీరజ్ చోప్రాను అభినందిస్తూ ఎక్స్ వేదికగా ఇలా రాసుకొచ్చారు. "గొప్ప విజయం! దోహా డైమండ్ లీగ్ 2025లో 90 మీటర్ల మార్కును అధిగమించిన తన వ్యక్తిగత అత్యుత్తమ త్రోను సాధించినందుకు నీరజ్ చోప్రాకు అభినందనలు. ఇది అతని అవిశ్రాంత అంకితభావం, క్రమశిక్షణ, అభిరుచి ఫలితం. నీరజ్ ప్రదర్శనతో భారత్ గర్విస్తోంది. " అని ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసించారు.



## మ్యాచ్ వర్షార్పణం..

### ఇరు జట్లకు చెరో పాయింట్




**బెంగళూరు:** భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా వాయిదా పడిన ఐపీఎల్ శనివారం (మే 17) తిరిగి ప్రారంభమైంది. అయితే ఈ రోజు వర్షం అడ్డంకిగా మారింది. బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దైంది. ఎంతకీ ఆగకుండా ఏకధాటిగా వర్షం పడడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఈ మ్యాచ్‌లో గెలిచి నేరుగా ప్లే ఆఫ్స్‌కు చేరుకోవాలని ఆర్సీబీ భావించింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో విజయం సాధించి ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలని కేకేఆర్ అనుకుంది. వర్షం కారణంగా మ్యాచ్ రద్దుకావడంతో ఇరు జట్లకు చెరో పాయింట్ లభించింది. దీంతో కేకేఆర్ ఈ టోర్నీ ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకుంది. మిగిలిన మరో మ్యాచ్‌లో గెలిచినా కేకేఆర్‌కు ప్లే ఆఫ్స్‌కు ఛాన్స్ దక్కదు. దీంతో ఇప్పటికే ఈ టోర్నీ నుంచి నిష్క్రమించిన చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్తాన్ రాయల్స్ సరసన కేకేఆర్ కూడా నిలిచింది. ఈ నాలుగు జట్లు ఇప్పటికి అధికారికంగా ఐపీఎల్ 2025 నుంచి నిష్క్రమించాయి. ఇక, టాప్-4 స్థానాల కోసం మిగిలిన ఆరు జట్లు పోటీపడతాయి.

మ్యాచ్ రద్దు కావడంతో ఒక పాయింట్ సంపాదించిన ఆర్సీబీ మళ్లీ టేబుల్ టాప్ స్పాట్‌కు చేరుకుందిది. అయితే ప్లే ఆఫ్స్ బెర్త్‌ను కన్ఫామ్ చేసుకోవాలంటే మాత్రం మరో విజయం సాధించాల్సిందే ఇప్పటికి 12 మ్యాచ్‌లు ఆడి 8 విజయాలు సాధించి 17 పాయింట్లతో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానానికి చేరుకుంది. తర్వాతి మ్యాచ్‌లో గెలిస్తే ఆర్సీబీ నేరుగా ప్లేఆఫ్స్‌కు చేరుకుంటుంది.

## ముంబయిలో ఇకపై టికెట్లు ఎవరిని అడగాలో తెలుసు'

### మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్




**ముంబై:** ప్రతిష్ఠాత్మక వాంఖడే స్టేడియంలో ఓ స్టాండ్‌కు టీమ్‌ఇండియా స్టార్ రోహిత్ శర్మ పేరు పెట్టడంపై తోటి క్రికెటర్లు, మాజీలు అతడికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ రోహిత్‌కు అభినందనలు తెలిపాడు. రోహిత్ క్రికెట్‌లో సాధించిన విజయాలకు సరైన గుర్తింపు లభించిందని అన్నాడు. అలాగే ఇప్పట్నుంచి టికెట్లు ఎవరిని అడగాలో తనకు తెలుసు అంటూ సరదాగా పేర్కొన్నాడు.'హేయ్ రోహిత్ వాంఖడే స్టేడియంలోని ఈ స్టాండ్స్‌కు ఎన్నో సిక్స్‌లు పంపించావు. అందుకే స్టేడియంలో ఈ రోజు నీ పేరిట ఒక స్టాండ్ వచ్చింది. ప్రపంచంలో అత్యుత్తమ స్టేడియాల్లో వాంఖడే ఒకటి. ముంబయి జట్టు, టీమ్‌ఇండియాకు నువ్వు అందించిన సేవలకు ఇది నీకు దక్కిన రివార్డ్. ఈ గౌరవానికి నువ్వు పూర్తి అర్హుడివి. ఇదే గ్రౌండ్‌లో మళ్లీ మళ్లీ ఆడాలని నువ్వు కోరుకుంటావు. నీకు, నీ కుటుంబ సభ్యులకు ఇవి అద్భుతమైన క్షణాలు. ఈ రోహిత్ శర్మ స్టాండ్‌లోకి నువ్వు మరెన్నో సిక్స్‌లు పంపించాలని కోరుకుంటున్నా' అని ద్రవిడ్ పేర్కొన్నాడు. ఇక చివర్లో ముంబయిలో తనకు ఎప్పుడైనా టికెట్లు కావాల్సి వస్తే ఎవరిని అడగాలో నాకు తెలుసంటూ అంటూ ద్రవిడ్ ఫన్నీగా అన్నాడు. ఈ వీడియోను ముంబయి ఇండియన్స్ తమ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో షేర్ చేసింది. కాగా, శుక్రవారం వాంఖడే స్టేడియంలో ఓ స్టాండ్‌కు అధికారికంగా రోహిత్ శర్మ పేరు పెట్టారు. ముంబయి క్రికెట్ అసోసియేషన్ శుక్రవారం ఈ కార్యక్రమాన్ని గ్రాండ్‌గా నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, రోహిత్ తల్లిదండ్రులు గురునాథ్‌శర్మ, పూర్ణిమ హాజరయ్యారు. సీఎం ఫడణవీస్‌తో కలిసి రోహిత్ తల్లిదండ్రులు ఈ స్టాండ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోహిత్ తల్లిదండ్రులు, భార్య రితిక ఎమోషన్ అయ్యారు.మరోవైపు, తన పేరుతో ఓ స్టాండ్ ఉన్న స్టేడియంలో మ్యాచ్‌లు ఆడబోతుండడం ప్రత్యేక అనుభూతి అని రోహిత్ అన్నాడు. క్రికెట్ స్టేడియంలో తన పేరిట ఓ స్టాండ్ పెడతారని కలలో కూడా ఊహించలేదని రోహిత్ పేర్కొన్నాడు.



## పిల్లలు ఫ్రీగా మ్యాచ్‌లను చూడొచ్చు..

**అంటిగ్వా:** ప్రస్తుత కాలంలో టెస్ట్ క్రికెట్ పట్ల క్రేజ్ తగ్గిపోతోంది. ఈ ఫార్మాట్‌ను ప్రోత్సహించడానికి అందరూ కొత్త వ్యూహాలను అవలంభిస్తున్నారు. అందుకే ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు ప్రైజ్ మనీని రెట్టింపు కంటే ఎక్కువ చేసింది. ఇంతలో ఓ క్రికెట్ బోర్డు టెస్ట్ మ్యాచ్‌ల సమయంలో పిల్లలకు ప్రవేశాన్ని ఉచితంగా కల్పించింది. ఈ కీలక నిర్ణయాన్ని వెస్టిండీస్ క్రికెట్ బోర్డు తీసుకుంది. వెస్టిండీస్, ఆస్ట్రేలియా మధ్య జరగనున్న 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ సందర్భంగా స్టేడియంలోకి పిల్లలకు ప్రవేశం ఉచితం అని క్రికెట్ వెస్టిండీస్(ఎక్స్‌లో) వెల్లడించింది.వచ్చే నెలలో ప్రారంభమయ్యే 3 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను చూడటానికి కరేబియన్‌లోని పిల్లలు ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. క్రికెట్ వెస్టిండీస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ క్రిస్ డెహ్రింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. బార్బడోస్‌లోని కెన్సింగ్టన్ ఓవల్, గ్రెనడాలోని గ్రెనడా నేషనల్ స్టేడియం, జమైకాలోని సబీనా పార్క్‌లలో జరగనున్న టెస్ట్ మ్యాచ్‌లకు పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.కెన్సింగ్టన్ ఓవల్‌లో 'వెస్టిండీస్ హోమ్-ఫుల్ ఆఫ్ ఎనర్జీ' ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా డెహ్రింగ్ మాట్లాడుతూ.. క్రికెట్ వెస్టిండీస్ కొత్త విధానంలో భాగంగా ఈ చొరవ ప్రారంభించబడిందని అన్నారు. ప్రతి బిడ్డకు టెస్ట్ క్రికెట్ ఆడటం అనేది మానవ హక్కు అని క్రికెట్ వెస్టిండీస్ తాము నమ్ముతున్నామన్నారు. కరేబియన్‌లో టెస్ట్ క్రికెట్ ఆడటం అనేది మానవ హక్కు అని.. అందుకే ఆ సంవత్సరం మొదటిసారిగా పిల్లలందరూ టెస్ట్ మ్యాచ్‌లను ఉచితంగా చూడగలిగే విధానానని రూపొందిస్తున్నామని ఆయన అన్నారు. మీకు టికెట్ అవసరం లేదని.. అది మీ హక్కు అంటూ డెహ్రింగ్ పేర్కొన్నారు. అయితే ఎంత వయస్సు వరకు పిల్లలకు ఉచిత ప్రవేశం లభిస్తుందో ఇంకా తెలియరాలేదు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..





# నయనతారను ఒప్పించేశారు

## చిరు సరసన మరోమారు ఓకే

ఒక్కోసారి అలా అలా జరిగిపోతుంది. అయితే దేనికైనా టైమ్ రావాలి... అంతే! అగ్ర కథానాయకుడు చిరంజీవి , దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఒక కొత్త సినిమా పట్టాలెక్కిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథానాయికగా నయనతార నటించనున్నారంటూ గత కొన్ని రోజుల నుంచి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆ వార్తలను నిజం చేస్తూ.. నయనతార కథానాయికగా నటిస్తున్నారని టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఓ ఆసక్తికర వీడియోను ఈ సందర్భంగా పంచుకుంది. ఇందులో నయనతార కథానాయికగా నటిస్తున్నారని చెప్పింది. ఒక ఆసక్తికర వీడియోను పంచుకుంది. వీడియో చివర్లో చిరంజీవి మేనరిజంలో 'హలో మాస్టారు.. కెమెరా కొద్దిగా రైట్ టర్నింగ్ ఇచ్చుకోమ్మా ' అంటూ ఆమె చెప్పిన సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. టీమ్‌లోకి ఆమెను స్వాగతిస్తూ చిరు సైతం పోస్టు పెట్టారు. హ్యాట్రిక్ మూవీకి స్వాగతం. ఆమెతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. 'సైరా నరసింహారెడ్డి', 'గాడ్ ఫాదర్' తర్వాత చిరు – నయన్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిది. తనదైన మార్క్ కామెడీ, యాక్షన్‌తో అనిల్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సాహు గారపాటి, చిరంజీవి తనయ సుస్మిత సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చిరు.. ఇందులో తన అసలు పేరు శంకర్ వరప్రసాద్ పాత్రలో నటించనున్నారు. ఇందులో ఇద్దరు కథానాయికలు కనిపించే అవకాశం ఉందని ఓ పాత్ర కోసం అదితిరావు హైదరిని సంప్రదించారని సమాచారం. భీమ్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాని వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



# బికినీలో స్టార్ కిడ్

బీచ్ వెకేషన్స్ ని ఎంజాయ్ చేయాలంటే కపూర్ సిస్టర్స్ తర్వాతే. జాన్వీకపూర్- ఖుషి కపూర్ ప్రతియేటా సీజన్‌కి అతీతంగా మాల్దీవుల విహారయాత్రల్లో అభిమానులకు వేడెక్కించే ట్రీట్ ప్లాన్ చేస్తారు. ఈసారి వేసవికి ఖుషికపూర్ తన స్నేహితుడు ఒర్రీతో కలిసి బీచ్ వెకేషన్ లో సందడి చేస్తున్న ఫోటోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి. ప్రస్తుతం ఖుషీ ధరించిన స్పెషల్ బికినీ యూత్ లో హాట్ టాపిగ్గా మారింది. సింపుల్ గా బికినీలో జలకాలాటలకు సిద్ధమైన ఖుషీ తన స్నేహితుడు ఓర్రీతోను సెల్ఫీలు దిగింది. అందుకు సంబంధించిన ఫోటోలు కూడా వైరల్ గా మారుతున్నాయి. కొన్ని వరుస పరాజయాల తరవాత కెరీర్ ని రీవ్యాంప్ చేయడానికి ముందు, ఇలా బీచ్ విహార యాత్రలతో చిల్ అవ్వాలి. ప్రస్తుతం ఖుషీ చేస్తున్నది ఇదే. లవ్ యాపా, నాదానియాన్ లాంటి ఫ్లాపులతో పూర్తిగా నీరసించిపోయిన ఖుషీ కపూర్ ఇప్పుడు చల్లచల్లని కూల్ బీచ్ వాటర్స్ లో చిల్ అవుతోంది. డెబ్యూ ఫ్లాపైనా, మునుముందు తనను తాను రీషేప్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది ఈ నటవారసురాలు.



# తుడురుమ్‌లో అద్భుత నటన

## టాలెంట్ ప్రూవ్ చేసుకున్న శోభన

ఇప్పటి జనరేషన్ కు అంతగా తెలియని ఓ అద్భుతమైన నటి శోభన. పేరుకు మలయాళమ్మాయి అయినప్పటికీ తెలుగులో ఆమెకు కల్ట్ ఫ్యాన్స్ ఉన్నారు. 80–90స్‌లో వెండి తెరను ఓ ఊపు ఊపేసిందీ ఈ భామ. క్లాసికల్ డ్యానర్రైన శోభన కళ్లతోనే హావా భావాలు పలికించగలదు. 40 ప్లస్, 50 ప్లస్‌లో హీరోయిన్లుగా రాణించాలంటే మాటలు కాదు. శోభన మరోసారి సిల్వర్ స్క్రీన్ పై మెరుపులు మెరిపించడమే కాదు ఆమె నటిస్తే రికార్డులు క్రియేట్ అయ్యేలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తోంది. అప్పుడెప్పుడో 18 ఏళ్ల క్రితం తెలుగు తెరకు దూరమైన శోభన కల్కి 2898ఏడీ మరియంగా మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చి పవర్ ఫుల్ ఫెర్మామెన్స్ చూపించింది. 2024లో వచ్చిన కల్కి ఆ ఏడాది హయ్యెస్ట్ సెకండ్ గ్రాసర్ చిత్రంగా నిలిచింది. తెలుగులోనే కాదు మలయాళంలో కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తోన్న తుడరుమ్‌లో కూడా వన్ ఆఫ్ ది పార్ట్ అయ్యింది శోభన. సుమారు 15 ఏళ్ల తర్వాత మోహన్ లాల్‌తో జోడీ కట్టింది. ఏప్రిల్ 25న రిలీజైన ఈ సినిమా 20 రోజుల్లోనే రూ. 200 కోట్లను కొల్లగొట్టి మలయాళంలో అతిపెద్ద బ్లాక్ బస్టర్ చిత్రంగా నిలిచింది. లలితగా లాలట్టన్ భార్యగా చాలా సింప్లీ లుక్కులో కట్టిపడేసింది. ఇలా బ్యాక్ టు- బ్యాక్ హిట్ చిత్రాలను తన ఖాతాలో వేసుకుని 55 వయస్సులో ఏజ్ ఈజ్ జస్ట్ ఎ నంబర్ అని ప్రూవ్ చేస్తూ.. తన తరం నటీమణులకు ఇన్స్పిరేషన్ అవుతోంది. ఈ ఏడాదే ఆమెను పద్మ భూషణ్ అవార్డ్ వరించింది.

# కన్నప్ప చరిత్ర తెలియని వారే తప్పు పడతారా ?

## మూవీ ప్రమోషన్‌లో మంచు విష్ణు ఆసక్తికర వ్యాఖ్యలు

నటుడు మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటించిన 'కన్నప్ప' జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఓ పాడ్ కాస్ట్‌లో పాల్గొన్న విష్ణు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కన్నప్ప సినిమా ఎలా ఉ ంటుందో తెలియకుండానే కొంతమంది ఇందులోని సన్నివేశాలను తప్పుపడుతూ సెన్సార్ బోర్డ్‌కు లెటర్లు రాశారు. అది తెలిసి వాళ్లకు మన చరిత్ర గురించి తెలియదని నవ్వుకున్నాను. శ్రీకాళహస్తి లోని అర్చకులందరికీ 'కన్నప్ప'ను చూపించాం. ఏమైనా పొరపాట్లు- ఉంటే చెప్పమని అడిగాం. ఇందులో ఒక్క ఫ్రేమ్ కూడా మార్చొద్దని వారు అన్నారు. 'భక్తి అంటే ఏంటో ఇందులో చూపించారుని ప్రశంసించారు. అదే నా బలం. ఈ చిత్రం కోసం అనుకున్న దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఖర్చు పెట్టాను. ఎంత అనేది మాత్రం చెప్పను. ఇటీవల ఎదురైన పరిస్థితుల వల్ల నేను బాధ పడ్డాను. బాధ అనేది చిన్న పదం అవుతుంది. ప్రస్తుతం నేను దేని గురించి ఆలోచించడం లేదు. మా నాన్న సంతోషంగా ఉండాలి. ఆయన పడిన కష్టానికి నేను ఆయనకు మంచి పేరు తీసుకురాకపోయినా ఫర్వాలేదు. కానీ.. ఆయనకు చెడ్డపేరు తీసుకురాకుడదు. అదే నా తపన. నేను ఇప్పుడు పూర్తిగా శివ భక్తుడిగా మారిపోయాను. ఆయన ధ్యానం చేసుకుంటున్నా కాబట్టి పాజిటివ్‌గా ఉండగలుగుతున్నాను. నేను, ప్రభాస్ చాలా క్లోజ్. అతడు ఎంత గొప్ప నటుడో అతడికి కూడా తెలియదు. ప్రభాస్‌లా చాలా తక్కువమంది ఉంటారు. కెరీర్ ప్రారంభంలో అందరూ సింపుల్‌గానే ఉంటారు. కానీ.. ఇంతపెద్ద స్టార్‌గా ఎదిగాక కూడా అలానే ఉండడం అతని గొప్పతనం. మేము ఎప్పటికీ సోదరులమే. రక్తం పంచుకొని పుట్టినవాళ్లే ఈరోజు నా పతనం కోరుకునేటప్పుడు.. నేను, ప్రభాస్ రక్తం పంచుకొని పుట్టకపోయినా నా మంచి కోరుకుంటున్నాడు. అందుకే ఎన్ని జన్మలకైనా అతడికి రుణపడి ఉంటాను. ఈ కథ కోసం ఎంతోమంది సాయం చేశారు. విజయేంద్రప్రసాద్ సలహాలు కూడా తీసుకున్నాను. మోహన్‌లాల్ పాత్ర అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుంది. 'కన్నప్ప' భారీ స్థాయిలో విడుదల కానుంది. 2000లకు పైగా థియేటర్‌లలో దీన్ని రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఈ స్థాయిలో విడుదల అవుతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఈ విషయంలో ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్‌లకు థాంక్స్ చెప్పాలి. ఒక నటుడిగా మంచి పేరు సొంతం చేసుకోవాలన్నదే నా కోరిక అన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

విలేకరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాల్లో వెలువడుతున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల్లో, పట్టణంలో
పనిచేయుటకు విలేకరులు కావలెను.

మండలాల్లో, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్

స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి

నోట్: 'ప్రజానావ' సంస్థ పేరుతో ఎవరైనా
బెదిరింపులకు పాల్పడితే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే
కఠినచర్యలు తీసుకుంటాం

9676667020, 7288825681

Printed, Published and Owned by **Adula Thirupathi,** and Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, and Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TELTEL/2023/87657** Email: prajanaava@gmail.com. Phone No: **99484 33277.**